# ప్రవాసాంధ్రుల పేజీ

- సాక్షి.

**రాజర్షి శ్రీ రమణానంద స్వామీజీ.**

**తేదీ : జులై 14, 2007 సమయము : సాయంత్రము 6 గంటలకు**

**స్థలము : సెయింట్ లూయిస్ హిందూ దేవాలయ ప్రాంగణము.**

**అంశము** : ఆధ్యాత్మిక గురువును తెలుసుకొనడం ఎలా? గురువుకు ఉండవలసిన లక్షణములు. షిర్డీ సాయిబాబాగారి జీవితములోని కొన్ని సంఘటనలు మొదలైన అంశాలు చర్చించబడ్డాయి.

గురువు అనగా అజ్ఞాన అంధకారాన్ని తొలగించేవాడని అర్థము. మరి గురువుకు ఉండవలసిన లక్షణములు ఏమిటి? మంచి శీలము కలిగి, మంచిని ఆచరించి నలుగురికి ఆదర్శముగా ఉండాలి. ఏ గురువైనా తాను సచ్చిదానందాన్ని అనుభవిస్తేనే తప్ప వేరొకరికి ఆ అనుభూతిని కలిగించలేరు. మనము బెల్లము రుచిచూస్తేనే కదా అది తియ్యగా ఉందని చెప్పగలము. అంతేకాని ఎక్కడో చదవడము వలనగాని, వినడము వలనగాని ఆ విషయాన్ని గ్రహించి చెప్పినా దానికి పూర్ణత్వము సిద్ధించదు. అనుభవ పూర్వకముగా తెలుసుకున్నప్పుడు దానిని వేరొకరికి చక్కగా వివరించి వారిని ఆ అనుభూతి పొందేటట్లు చెయ్యడానికి అవకాశముంది. అలాగే కృష్ణభగవానుడు, రాముడు, షిర్డీ సాయిబాబా మొదలైన వారంతా గురువును ఆశ్రయించి, ప్రతివ్యక్తి గురువు సన్నిధిలో సాధన చెయ్యవలెనని ఆచరించి చూపారు. గురువులేని విద్య గుడ్డి విద్య అనడం మనకు తెలిసినదే! గురువు ఆదేశాను సారము సాధన చెయ్యడము వలన మనము సరియైన దిశలో సాధన చేస్తున్నట్లు తెలుసుకోవడం సాధ్యపడుతుంది. ఇంకా ఆ రోజు కార్యక్రమానికి హాజరైన పలువురి ప్రశ్నలకు స్వామీజీ సమాధానములు చెప్పి, వారి సందేహ నివృత్తి చేసారు. ఇందులో పొందుపరచిన విషయములు నాకు అర్థమైనంత పరిధిలో వివరించడం జరిగింది. వీటిలో ఏవైనా తప్పులుంటే దానికి నూరు శాతము బాధ్యతను స్వీకరిస్తున్నాను.

**తేదీ : జులై 22 వ తేదీ 2007 సమయము : సాయంత్రము 5:30 గంటలు**

**స్థలము : మహాత్మాగాంధి కల్చరల్ సెంటర్, సెయింట్ లూయిస్.**

**కళాకారులు : గాన గంధర్వ శ్రీ గుమ్మడి గోపాలకృష్ణగారు.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వంచే రెండుసార్లు ఉత్తమనటుడుగా నంది బహుమతి గెలుచుకున్న శ్రీ గుమ్మడి గోపాలకృష్ణగారు శ్రీ కృష్ణరాయబారం, శ్రీ కృష్ణ తులాభారం, శ్రీనాధుడు మొదలైన నాటకములలోని పద్యములను వీనుల విందుగా వినిపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసారు. హరిశ్చంద్ర నాటకములోని కొన్ని ఘట్టములను కూడా వినిపించారు. ఇంకా పోతన భాగవతములోని గజేంద్రమోక్షములోని కొన్ని పద్యములు, ప్రహ్లాద చరిత్రలోని కొన్ని పద్యములు వినిపించి "ఆహా! పద్యమంటే ఇలా పాడాలి కదా!" అని ప్రేక్షకులు అనుకునేటట్లు తన గాంధర్వ గానంతో రంజింపజేసారు. ప్రేక్షకుల కరతాళధ్వనులతో సభాప్రాంగణము ప్రతిధ్వనించింది. వారి కార్యక్రమమును ఏర్పాటు చేసిన


శ్రీ సురేంద్ర పాతూరి, శ్రీ రవి పసుపులేటి మరియు మిగిలిన కార్యకర్తలందరూ ఎంతైనా ప్రశంసనీయులు. ఈ కార్యక్రమమును శ్రీ గుమ్మడి గోపాలకృష్ణగారు ఒక్కరే నటిస్తూ, పాత్రలకు ప్రాణం పోసారు. త్వరలోనే వారు వారి బృందముతో సెయింట్ లూయిస్ నగరములో ఏదైనా ఒక నాటకాన్ని ప్రదర్శిస్తామని హామీ ఇవ్వడముతో ప్రేక్షకులు ఆనందపరవశులయ్యారు.

## మేధావధానము

**తేదీ : జులై 28, 2007 సమయము : ఉదయము 10 గంటలకు**

**స్థలము : తార్న్‌హిల్ గ్రంథాలయము, సెయింట్ లూయిస్.**

జులై 28వ తేదీ ఉదయము 10 గంటలకు తార్న్‌హిల్ గ్రంథాలయ ప్రాంగణంలోని హాల్‌లో సందడిగా ఉంది. సందడి రావాలంటే - చెంగు చెంగున గెంతులేనే, హరిణములను బోలిన, పిల్లలు ఉండవలసినదే కదా! అందులో ఓ ఏడుగురు పిల్లలు నాటి కార్యక్రమానికి కీలకమైన పాత్రను పోషించనున్నారు. వారి తల్లిదండ్రులు, సహోదరులు వారు చేయబోతున్న సాహస ప్రక్రియకి గర్వంగా, ఆనందంగా వివిధములైన అనుభూతులతో, వారిని వేదికమీద చూడాలని కుతూహలపడుతున్నారు. అనుభవరాహిత్యము వలన కార్యక్రమము ఓ 15 నిమిషములు ఆలస్యముగా మొదలయింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆహ్వానించిన శ్రీమతి స్మితారాజన్ (భరతనాట్యము, కేరళ శాస్త్రీయనృత్యము మోహినీఆట్టం, కథాకళిలలో ప్రముఖులు మరియు గురువు) మా ఆహ్వానాన్ని మన్నించి, వారి పనులను కూడా ప్రక్కన పెట్టి, ఈ కార్యక్రమానికి నిర్ణీత సమయానికి ముందే రావడం మా అదృష్టంగా భావిస్తున్నాము. ముందుగా ముఖ్య అతిధిని వేదికపైకి ఆహ్వానించడము, శ్రీమతి సురేఖ మాచిరాజు (అవధానిగారి శ్రీమతి) వారిని సభాసదులకు పరిచయము చేయడము జరిగింది. తదనంతరము స్మితారాజన్ గారు గురువుయొక్క అవసరము, గురువును సేవించే పద్ధతి, గురుశిష్య సంబంధము ఎలా ఉండాలి అనే అంశాలపై మాట్లాడి, శ్రీ శ్రీనివాస రామానుజన్ మేధమేటిక్స్ క్లబ్ గురించి క్లుప్తంగా వివరించారు.



శ్రీమతి స్మితారాజన్

ఈ కార్యక్రమ నిర్వాహణ బాధ్యత అంతా మేధమేటిక్స్ క్లబ్‌లో పాల్గొన్న పిల్లల తల్లిదండ్రులే తీసుకోవడం, వారికి ఆ క్లబ్ కార్యక్రమముపై గల ఆసక్తిని తెలియజేస్తుంది. ఎం.వి. కృష్ణారావుగారు - వారి శ్రీమతి మాధవిగారు, శ్రీనివాస్ కొంపల్లి - వారి శ్రీమతి ప్రవీణగారు, శ్రీకాంత్ గూటాల - వారి శ్రీమతి జయలక్ష్మిగారు, రమాకాంత్ ఒగిరాల - వారి శ్రీమతి లక్ష్మిగారు, కామేష్ కడియాల - వారి శ్రీమతి మాధవిగారు, సత్య బరగడ - వారి శ్రీమతి ఫణిగారు, జుగేష్ ఆనంద్ - వారి తల్లిగారు,

ప్రాణేశ్ - వారి శ్రీమతి రమ రాయచోటి, రవి పసుపులేటి - వారి శ్రీమతి లక్ష్మిగారు, ఎం. మంజులగారు, ఇంకా ఎందరో ఈ కార్యక్రమము చక్కగా నిర్వహించబడడానికి తోడ్పడ్డారు. కార్యక్రమమును తన్మయత్వంతో ఆస్వాదించిన 'సాక్షి', ఈ కార్యక్రమనిర్వాహణకి తోడ్పడిన అందరినీ ప్రస్తావించి ఉండకపోవచ్చు. అతనిని పెద్ద మనసుతో క్షమించమని మా మనవి.



*అవధాన కార్యక్రమాన్ని ఆసక్తితో తిలకిస్తున్న ప్రేక్షకులు*

మేధమేటిక్స్ క్లబ్ నిర్వహించిన శ్రీనివాసరావు అయినాపురపును వేదికపైకి ఆహ్వానించడం జరిగింది. ఆయన (నేటి కార్యక్రమములో అవధాని కూడా) తన ప్రసంగంలో సంఘమిత్ర సంస్థ గురించి, శ్రీ శ్రీనివాస రామానుజన్ మేధమేటిక్స్ క్లబ్ నిర్వాహణ గురించి వివరించారు.

'మనం సమాజంలో ఏ మార్పు చూడాలనుకుంటామో, ఆ మార్పు మనమే కావాలి.' అన్న గాంధీ మహాత్ముని సూక్తిని గుర్తు చేసి, సంఘమిత్ర అన్న పదానికి అర్థము - 'సంఘ' అనగా మనము నివసిస్తున్న సమాజము అని, 'మిత్ర' అనగా స్నేహితుడు అని వివరిస్తూ, ఈ సంఘమిత్ర సంస్థ సర్వమానవ సౌభ్రాతృత్వం ధ్యేయంగా పనిచేస్తున్నదని తెలియజేసారు. మన చేతికి దెబ్బ తగిలితే కళ్ళనుండి నీరు కారుతుందని, వాటికున్న సంబంధము ఏమిటి? అని ప్రశ్నిస్తూ - అది ఏకత్వానికి అర్థమని, అలాగే మన సమాజంలో మన పొరుగువానికి కష్టము కలిగితే మన వంతుగా వారికి సహకారం



శ్రీనివాసరావు అయినాపురపు

అందించాలని, ఆనాటి అతిధుల కరతాళ ధ్వనుల మధ్య తెలియజేసారు. తల్లి ఎప్పుడూ పిల్లల అభివృద్ధిని కోరుతుందని, దానికోసం ఆమె తన సర్వస్వాన్ని ధారపోస్తుందని, తిరిగి ఆమె ఏమీ ఆశించదని - అలాంటి స్వచ్ఛమైన ప్రేమను నలుగురికి పంచడము ఒక వరమని, అదే సంఘమిత్రకు పునాది అని తెలియజేసారు.

మన వేదములు ఒకరి సొత్తు కాదని, ఎందరో గురువులు వేల సంవత్సరముల క్రితమే మనకు అందజేసారని, ఇది మన గొప్పదనము ఎంతమాత్రమూ కాదని, మన పూర్వీకుల సౌశీల్యానికి ధన్యవాదములు చెప్పుకోవాలని తెలియజేసారు. వేద గణితము అనేది మన వేదములలో గుప్తంగా పొందుపరచబడిన సూత్రముల ఆధారముగా రూపొందించినది. ఈ విషయములో ఆద్యులు జగద్గురు శంకరాచార్య శ్రీ. భారతీ కృష్ణతీర్థ (1884 - 1960) గారిని మనము స్మరించుకోవాలి. ఆయన ఈ సూత్రములను వెలికితెచ్చి, 16 సంపుటాలుగా వెలువరించారు. దురదృష్టవశాత్తూ అవి కాలగర్భంలో కలిసిపోగా, ఆయనే చివరి రోజులలో సంక్షిప్త రూపంలో అందించిన ఒక పుస్తకము మాత్రమూ మనకు మిగిలింది. హ్యూమన్ కంప్యూటర్‌గా మనకు తెలిసిన శ్రీమతి. శకుంతలాదేవి మరియు గణిత శాస్త్రవేత్త శ్రీ. శ్రీనివాసరామానుజన్‌లు మేధమేటిక్స్ క్లబ్ నిర్వహించాలనే ఆలోచనకి స్పూర్తి అని చెప్పారు.

తరువాత సంఘమిత్ర నేటికి చేబడుతున్న కొన్ని కార్యక్రమాలను అతిధులకు తెలియజేసారు. వీటిలో మొదటిది 'సంఘమిత్ర' త్రైమాసిక పత్రిక. దీనిని http://www.sanghamitra.org అనే వెబ్ చిరునామా వద్ద దర్శించవచ్చు. ఈ పత్రికను అక్టోబరు 2007 నుండి తెలుగు మాత్రమే కాకుండా ఆంగ్లములోను ప్రచురించే ఆలోచనను వ్యక్తం చేసారు. సంఘమిత్ర కార్యక్రమములలో రెండవది శ్రీ శ్రీనివాస రామానుజన్ మేధమేటిక్స్ క్లబ్. మూడవది కళాశాల/ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకములకు, బట్టలకు మరియు శిక్షణ రుసుములకు ఆర్థిక సహాయం అందించడం. నాల్గవది వయోవృద్ధులకు ఆర్థికముగా, నైతికముగా సహకారాన్ని అందించడం. మీ అందరి సహకారం ఉంటే 'ఈనాటి సంఘమిత్ర కల రేపటి వాస్తవం' కాగలదని ఆశాభావాన్ని వ్యక్తం చేసారు.

తరువాత జయలక్ష్మి గారు అవధానములో పాల్గొన్న పిల్లలను వేదికపైకి ఆహ్వానించారు. వారు వారికి కేటాయించిన స్థానములలో కూర్చున్నాక, అతిధుల ప్రశ్నలకు కాగితము, కలము ఉపయోగించకుండా ఇంచుమించు నిమిషములో సమాధానములు చెప్పడం జరిగింది. 999A x 999 B (A + B = 10 అయ్యేవిధముగా) వంటి గుణకారములను శ్రీనివాస తేజ ఓగిరాల, ఏదైనా సంఖ్యను (పది




అవధానములో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులతో శ్రీనివాస్.

అంకెల సంఖ్యవరకు) 9 చే భాగించినపుడు వచ్చే శేషమును ఉపాగ్య కొంపల్లి, రెండు వరుస సంఖ్యల వర్గముల వ్యత్యాసం ఇచ్చినచో - ఆ సంఖ్యలను కనుగొనడం రుచ శుక్ల, 5 అంకెల సంఖ్య వరకు11తో గుణకారమును సవిత బరగడ, ఇచ్చిన సంఖ్యల ఘనమూలమును (1 నుండి 1000000 వరకు) శ్రావ్య అయినాపురపు, ఐదు వరుసల కూడికను దివ్య గూటాల, ప్రేక్షకులు ఇచ్చిన 3 అంకెల సంఖ్యకు మరి 3 అంకెలను జోడించి - ఆ 6 అంకెల సంఖ్య 11 తో భాగించబడునట్లు సత్య ఆనంద్ తెలియజేసి ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఇక శ్రీనివాసరావు అయినాపురపు పంచమమూలములను (1 నుండి 10000000000 వరకు) కనుగొనడం; 4 x 4 మాత్రికను పూరించడము; 3 x 3 మాత్రికను పూరించడము; 7 తో భాగించబడేటట్లు 8 అంకెల సంఖ్యను కూర్చడం; వారగణనము (తేదీ, మాసము, సంవత్సరము ఇచ్చిన, వారము గణించడము); ప్రేక్షకులు ఇచ్చిన 3 అంకెలకు మరి 3, మళ్ళీ ప్రేక్షకులు ఇచ్చిన 3 అంకెలకు మరి 3 అంకెలు కూర్చి, 13తో భాగించబడునట్లు 12 అంకెల సంఖ్యను కూర్చడం;

1/29, 1/79 వంటి (హారము 9 తో ముగినే) భిన్నమును దశాంశమానములోనికి మార్చడం; 999[1-9] 999[1-9] వంటి గుణకారములకు సమాధానములు చెప్పడం చేసి ప్రేక్షకులను మెప్పించారు. ముఖ్యముగా 4 x 4 మాత్రికను పూరించినప్పుడు (పూరణ ప్రక్క పటములో చూపబడింది), 1/49 అనే భిన్నానికి 42 దశాంశస్థానములను వ్రాస్తున్నప్పుడు ప్రేక్షకులలో స్పందన కరతాళధ్వనులద్వారా వెలువడింది. తరువాత శ్రీనివాస రామానుజన్ మేథమేటిక్స్ క్లబ్‌లో పాల్గొన్న పిల్లలందరికి శ్రీమతి స్మితారాజన్ గారి ద్వారా యోగ్యతా పత్రములను అందజేయడం జరిగింది

| | | | |
|---|---|---|---|
| 19 | 26 | 2 | 7 |
| 6 | 3 | 23 | 22 |
| 25 | 20 | 8 | 1 |
| 4 | 5 | 21 | 24 |

*పై పటములో అడ్డు వరుసలను కూడినా, నిలువు వరుసలను కూడినా, వాలుగా కూడినా 54 వస్తుంది.*

*** *** ***